క్లుప్తంగా

బూచేపల్లి నియామకంపై దద్దాల హర్షం

కనిగిరి రూరల్: ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిని, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నియమించారు. వీరి నియామకంపై వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. అలాగే కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, స్థానిక నాయకులు ఒక ప్రకటనలో హర్షం తెలిపారు.

ఎస్సై మధుసూదన్‌రావు బాధ్యతల స్వీకరణ



కె. మధుసూదన్‌రావు

వెలిగండ్ల: స్థానిక ఎస్సైగా కె. మధుసూదన్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొమరోలు ఎస్సైగా పని చేస్తూ బదిలీల్లో భాగంగా వెలిగండ్లకు వచ్చారు. ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కె. మధుసూదన్‌రావుకు పోలీస్ స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

264 పొగాకు బేళ్ల తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 264 బేళ్లు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. చతుకుపాడు, కె.అగ్రహారం, మూగచింతల, గుర్రప్పడియా, నెన్నూరుపాడు గ్రామాలకు చెందిన రైతులు 1225 బేళ్లు వేలానికి తీసుకొచ్చారు. 961 బేళ్లు కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 264 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధర రూ.169, సరాసరి ధర 295.91 పలికింది. వేలంలో 11 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు

203 పొగాకు బేళ్ల తిరస్కరణ

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రువారం జరిగిన వేలంలో 203 పొగాకు బేళ్లను వ్యాపారులు వివిధ కారణాలతో తిరస్కరించారు. పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 1034 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 831 కొనుగోలు చేశారు. 203 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358 పలకగా కనిష్ట ధర రూ.190 పలకగా సరాసరి రూ.308.16 ధర పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నీటి సమస్య పరిష్కరించండి

కనిగిరి రూరల్: పట్టణంలో నీటి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 14వ వార్డులో సమస్య పరిష్కార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్యటించారు. స్థానికులు నీటి సమస్య, పారిశుద్ధ్య సమస్యపై ఫిర్యాదు చేశారు. రజక వీధిలో తీవ్ర నీటి సమస్య నెలకొందని వెల్లడించారు. ఏఈ కోటేశ్వరావును పిలిపించి మాట్లాడారు. నీటి పైప్ లైన్ లీకుల మరమ్మతులు వెంటనే చేయించాలని ఆదేశించారు. పట్టణంలో ట్యాంకర్లపై ఆధార పడకుండా సాధ్యమైనంత వరకు డీప్‌బోర్ వెల్, పైప్ లైన్ ద్వారా ఇవ్వాలని తెలిపారు. కౌన్సిలర్ దేవకి సత్యవతి, ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చైర్మన్ అబ్దుల్ గఫార్ మొక్కలు నాటారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు జి. అబ్రహం లింకన్, ఇన్‌చార్జి హెచ్ఎం ఏసురత్నం, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

టంగుటూరు: స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన లేళ్లపల్లి అమర్‌కు హత్యాయత్నం కేసులో కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిందని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో స్థానిక ఫైర్ స్టేషన్కు ఎదురుగా ఉన్న టుబాకో గోడౌన్ పక్కన మద్యం తాగుతూ పాత కక్షలు మనసులో పెట్టుకుని కారుమంచి రమేష్ను బీరు బాటిల్తో పొడిచాడు. నిందితుడు అమర్పై హత్యా ప్రయత్నం కేసు నమోదు చేశామన్నారు. ప్రత్యేక మొబైల్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ప్రకృతి సేద్యం పుడమి తల్లికి నైవేద్యం

టంగుటూరు: రైతు సాధికర సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఎం. నిడమానూరులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్ పి.శృతి శుక్రువారం దశపరణి కషాయం తయారు చేశారు. యూనిట్ ఇన్‌చార్జి వెంకట్రావు మాట్లాడుతూ దశపరణితో ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి, ఐసీఆర్‌పీలు సుజాత, మరియమ్మ, హరిత, త్రివేణి పాల్గొన్నారు.

హామీల అమలుకు దూరంగా ప్రభుత్వం



గుంతలమయంగా ఉన్న సింగరాయకొండ మెయిన్ రోడ్డు



పృథులగిరికి వచ్చిన సందర్భంగా అభివృద్ధికి హామీ ఇస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఆ పార్టీ టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఇచ్చిన హామీలన్నీ ప్రస్తుతం గాలికొదిలేశారు. ప్రభుత్వం ఏర్పడి సరిగ్గా 100 రోజులు దాటినా స్థానికంగా పరిష్కరిస్తామని చెప్పిన ఒక్క హామీ కూడా ఆయన పరిష్కరించిన దాఖలాలు లేవు. పైగా ఆయన మంత్రిగా ఉన్నా కొండపి నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమీ లేకుండా పోతోంది.

మంత్రిగారూ.. ఇవిగో హామీలు!

- సంగమేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీరు, తాగునీరు ఇస్తామన్నారు
- సింగరాయకొండలో దేవదాయ భూముల రిజిస్ట్రేషన్ సమస్య
- అయితా రామయ్య శ్రేష్టి సత్రం సమస్య
- పాకల బీచ్ నుంచి ఊళ్లపాలెం వరకు అభివృద్ధి చేయడంతో పాటు బీచ్‌లో అన్ని రకాల వసతుల కల్పన, గుంతల మయంగా ఉన్న ప్రధాన రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి డివైడర్‌పై విద్యుద్దీపాల ఆధునికీకరణ
- పాలేరు–బిట్రగుంట స్కీమ్ సప్లయ్ చానల్ ఆధునికీకరణ
- మన్నేరుపై చెక్‌డ్యాం నిర్మాణం
- సింగరాయకొండ మండలంలోని అన్ని గ్రామాలకు రామతీర్థం నీరు సరఫరా
- ఎస్సీ, ఎస్టీల కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుద్దీపాల ఏర్పాటు
- మండల కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు
- రోడ్లు, మురుగు కాల్వల అభివృద్ధి
- నిత్యావసరాలు, ఆర్టీసీ బస్సు చార్జీలు, గ్యాస్ సిలిండర్, విద్యుత్ చార్జీల తగ్గింపుపకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు
- మర్రిపూడి మండలంలో పృథులగిరి లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం అభివృద్ధితో పాటు కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు

మొక్కలు పర్యావరణ నేస్తాలు



హుస్సేన్‌పురంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ



మొక్కలు నాటుతున్న ఎస్ఓ, స్వచ్ఛంద సంస్థ కమిటీ

పామూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కేజీబీవీ ఎస్ఓ కటకం సజన, స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక కేజీబీవీలో శుక్రవారం స్వచ్ఛతాహిసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంవల్ల, పరిశ్రమల నుంచి వచ్చే రసాయనాలు, వెలువడే కాలుష్యం వల్ల నానాటికీ పర్యావరణం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు మెరుగైన, స్వచ్ఛమైన గాలిని, వాతావరణాన్ని అందించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతోపాటు మొక్కలునాటాలని, లేదంటే భావితరాలు క్షమించవన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల పెరుగుదల లేకుండా చూడాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: తల్లి పేరుతో ఒక మొక్క నాటాలని ఎంపీడీఓ రామచంద్రయ్య, ఈఓపీఆర్‌డీ టి. సుకుమార్ అన్నారు. మండలంలోని మొగళ్లూరు, హుస్సేన్‌పురం, రామగోపాలపురం గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అన్నపురెడ్డి కృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ సామాజిక బాధ్యత

హనుమంతునిపాడు: మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. శుక్రవారం హాజీపురం, హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన స్వచ్ఛత హీ సేవా స్వాభావ్, స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈఓఆర్డీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎంపీటీసీ ఉడుముల వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఎస్. తిరుపతరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బలు, సర్పంచ్ కత్తి రాజారావు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



హాజీపురంలో మొక్కలు నాటుతున్న అధికారులు ప్రజా ప్రతినిధులు



విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద మొక్క నాటుతున్న ఈఓ శ్రీనివాసరావు

సింగరాయకొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సోమరాజుపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సూచించారు. సోమరాజుపల్లి పంచాయతీలోని విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హెల్త్ సెంటర్ వద్ద ఆయన మొక్కలు నాటారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ చిమట సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ కటకం త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థ నేత బూచేపల్లి



బూచేపల్లిని సన్మానిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మంచిమనిషి, అందరినీ కలుపుకుపోయే మనసున్న మంచి వ్యక్తి, సమర్థుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని పార్టీ జిల్లా అద్యధ్యక్షుడిగా నియమించడం శుభపరిణామమని మాజీ మంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై న బూచేపల్లిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆదిమూలపు సురేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత తరుణంలో సరైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. జిల్లా స్థాయిలో పార్టీ ప్రక్షాళన జరుగుతుందన్నారు. బూచేపల్లి నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఇన్‌చార్జులు పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రతతో పనిచేస్తారని, ఎక్కడా జోక్యం చేసుకునే మనస్తత్వం ఆయనది కాదన్నారు. ప్రస్తుతం జిల్లాలో త్రిముఖ పోటీ ఉందని, ఈ పోటీలో అంతిమ విజయం బూచేపల్లి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీదేనని సురేష్ ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యేలు కుందూరు నాగార్జునరెడ్డి, టీజేఆర్ సుధాకర్ బాబు, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు, వరికూటి అశోక్‌బాబు, కాకుమాని రాజశేఖర్, కరణం వెంకటేష్ పాల్గొన్నారు.

25న సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు

కొండపి (సింగరాయకొండ): మూసీకి సాగర్ నీరు సాధన కోసం ఉద్యమించేందుకు జరుగుతున్న సదస్సుకు తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పెరిదేపిలో రైతులు, వ్యవసాయ కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దుక్కులు దున్ని వర్షాల కోసం ఈ ప్రాంత రైతులు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారని తెలిపారు. దేశమంతా వరదలు పారుతున్నా ఈ ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో సహజంగా మూసీ ఏరుకు వచ్చే నీరు రానందున పంటలు ఎలా పండించాలని రైతులు ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ స్థితిలో మూసీకి సాగర్ నీరు సాధన కోసం పరివాహక ప్రాంతంలోని రైతులు, రైతు కూలీలు కలిసి చర్చించుకునేందుకు సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 10 గంటలకు కొండపిలో సదస్సు జరుగుతుందని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు కేజీ మస్తాన్, రైతు సంఘ నాయకులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, పుట్టా రామారావు, కొల్లూరి బాలయ్య, కామని బ్రహ్మయ్య, రావిపాటి శ్రీను, కొల్లూరు శ్రీను, కోటపాటి రమణయ్య, చెన్నారెడ్డి కోటయ్య, పుట్టా వెంకయ్య, కోయి శేషయ్య, మల్లెల కొండయ్య, వందనం, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

కుట్టుమిషన్ అందజేత

పామూరు: మండల కేంద్రమైన పామూరులోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ కార్యాలయంలో శుక్రవారం పేద వారికి సేవ, సాయం కార్యక్రమంలో భాగంగా ఓ యువతికి కుట్టుమిషన్ అందజేశారు. ఈమేరకు రీజనల్ మేనేజర్ షేక్.మస్తాన్, బీఎం సీహెచ్.గిరిబాబు తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్‌లో వెనుకబడిన పేద ఖాతాదారులకు సాయంగా పామూరు బ్రాంచ్ పరిధిలో పి.నాగమణి అనే యువతికి అందజేసినట్లు తెలిపారు. విజయవాడ జోన్ పరిధిలోని 159 బ్రాంచ్‌లలో పేద ఖాతాదారులకు కుట్టుమిషన్‌లు అందజేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ డీవీ నారాయణ, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాగమణి

సింగరాయకొండ: ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని మదర్ ల్యాండ్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం–4లో శుక్రవారం మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా డ్యాప్కు లీడ్ ఎన్జీఓ–మదర్ ల్యాండ్ సొసైటీ సంయుక్తంగా సచివాలయ సిబ్బందికి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు ఎయిడ్స్ వ్యాధి సోకటంతో కలిగే అనర్థాలను వివరించి వ్యాధి రాకుండా ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఎం.వెంకటరావు, ఏ.సుభాషిణి, నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై ఎయిడ్స్ బారిన పడవద్దని మదర్ ల్యాండ్స్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ ఆర్. శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా మదర్ ల్యాండ్ సొసైటీ- డ్యాప్కు లీడ్ ఎన్జీవో సంయుక్తంగా ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ప్రతినిధి కె.నాగమణి నేడు యువత చెడు వ్యవసాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటుంన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హామీలన్నీ డొల్ల!



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (ఫైల్)

- కూటమి 100 రోజుల పాలన వృథా
- ఎన్నికల హామీల్లో ఒక్కటీ నెరవేర్చని వైనం
- కనిగిరలో కనిపించని పురోగతి
- ట్రిపుల్ ఐటీ కదలిక ఎక్కడ?
- ఇది మంచి ప్రభుత్వమా?

సాక్షి నెట్‌వర్క్: కూటమి ప్రభుత్వ పాలన ఏర్పడి వంద రోజులు అయింది. టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలతో పాటు.. నియోజకవర్గ ముఖ్య నేతలు కూడా ఎన్నికల్లో పలు వాగ్దానాలను గుప్పించారు. కానీ వాటిలో ఏదీ అమలు కాకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఎన్నిక ప్రచారంలో భాగంగా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నియోజకవర్గంలో ఐదు హామీలపై విస్తృత ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కనిగిరికి కృష్ణా జలాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని, నిమ్జను ప్రారంభించి వలసల నివారణ చేపడతామని, నడికుడి- కాళహస్తి రైల్వే లైన్‌ను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. అంతేకాక కేవలం కనిగిరి నియోజకవర్గానికే సంబంధించిన ట్రిపుల్ ఐటీ కళాశాలను కనిగిరిలోనే ప్రారంభించి.. కనిగిరి ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా ఆరు మండలాల్లో ప్రతి గ్రామంతో పాటు, పట్టణంలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా సాగర్ జలాలు అందించి కనిగిరి ప్రజలను శాశ్వతంగా ఫ్లోరైడ్ బారి నుంచి విముక్తి కలిగిస్తామని హామీలు గుప్పించారు. ఎమ్మెల్యే ప్రచారం చేసిన ఈ కార్యక్రమాలపై సంబంధిత శాఖ మంత్రులు, అధికారులను హడావిడి చేశారు. కానీ ఎటువంటి పురోగతి సాధించలేదు. దీంతో అవి ఎన్నికల ప్రచార హామీలుగానే మిగిలాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు కావస్తున్నా.. ఇటు రాష్ట్రంలో, అటు నియోజకవర్గంలోని అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీల అడుగులు ముందుకు పడలేదు. ఇటీవల సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్‌పై, వాటర్ గ్రిడ్ పథకాల పూర్తిపై మాట్లాడుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అవి కార్యరూపంలో లేవు. దీంతో ఏమి చేశారని.. 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచారం చేపట్టారని ప్రజలు విమర్శిస్తున్నారు.

'మంచి పాలన కాదు.. దుష్టపాలన'

- దేవుళ్ల ప్రసాదాలపై అనుచిత వ్యాఖ్యలు తగవు
- చంద్రబాబుపై దద్దాల నారాయణ ధ్వజం



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: 'సూపర్ సిక్స్ అంటూ రైతులు, మహిళలు, పిల్లలను మోసం చేశావు.. కుట్రలు, దాడులు.. అరాచకాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చావు.. ఇదే నా.. నీ వంద రోజుల మంచి పాలన' అని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచి.. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని దూరం చేయడమే.. చంద్రబాబు సర్కార్ వంద రోజుల ట్రాక్ రికార్డ్ అని ఘాటుగా విమర్శించారు.

సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టారు..

తల్లికి వందనం ఎక్కడా? పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తారు? ప్రతి మహిళకు నెలకు రూ 1,500 ఎక్కడని, ఉచిత బస్సు ప్రయాణం ఏమైందని? యువతకు ఉద్యోగాలు ఎక్కడని.. ప్రతి ఇంటికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 87 శాతం హామీలను అమలు చేశారని గుర్తు చేశారు. నాడు తొలి కేబినెట్‌లోనే అనేక మంచి నిర్ణయాలు తీసుకుని దేశానికే ఆదర్శంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని కొనియడారు.

లడ్డూ ప్రసాదంపై అనుచిత వాఖ్యలు తగవు..

కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం చంద్రబాబు దేవుళ్ల ప్రసాదాలపై రాజకీయాలు చేస్తున్నారని దద్దాల నారాయణ యాదవ్ ఘాటుగా విమర్శించారు. మత బాబు చేస్తున్న వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేవలం ప్రతిపక్షంపై బురద జల్లేందుకే ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతినే విధంగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనిక్కి తీసుకోవాలని దద్దాల నారాయణ డిమాండ్ చేశారు.

క్రీడలతో ఒత్తిడి దూరం



సింగరాయకొండ: క్రీడలు ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు



టంగుటూరు: క్రీడలు ప్రారంభిస్తున్న జయంత్‌బాబు

కొండపి (సింగరాయకొండ): క్రీడలతో ఒత్తిడి దూరం అవుతుందని కొండపి ఎంఈఓ-2 రామారావు అన్నారు. మండలంలోని కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సూసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ సెలక్షన్ గేమ్స్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి స్కూల్ గేమ్స్ను ప్రారంభించారు. అండర్-17 విభాగంలో వివిధ క్రీడల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ బ్రహ్మయ్య, వెన్నూరు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి, మండల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టంగుటూరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం ఉంటుందని స్థానిక మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఖాళీ సమయాల్లో శారీరిక దారుఢ్యాన్ని, మానసిక వికాసాన్ని పెంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయకుండా ఉండాలని చెప్పారు. సెల్‌ఫోన్ల ద్వారా విద్యార్థులు తప్పుదారి పడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలన్నారు.



కొండపి: ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ-2 రామారావు

250 మంది క్రీడాకారులు సెలక్షన్లో పాల్గొన్నారు. టంగుటూరు సర్పంచ్ మమత, బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంఈఓ చెంచు పున్నయ్య, బాలాజీ, ప్రధానోపాధ్యాయురాలు తులసి ప్రభ, మండల కో ఆర్డినేటర్ అరుణ, కొండపి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కో ఆర్డినేటర్ అశోక్, పీడీలు మోహన్, వెంకట్రావు, ఉష, కౌసల్య, జయలక్ష్మి, వెంకట్రావు, చిరంజీవి పాల్గొన్నారు

సింగరాయకొండ: క్రీడలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు పోటీతత్వం పెరుగుతుందని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు కత్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి పోటీల్లో పాల్గొన్నారు. ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయులు హరేరామ్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకోండి



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీఎస్‌పురం (పామూరు): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఆదర్శంగా తీసుకుని అంకిత భావంతో పనిచేయాలని ఎంఈఓ జె.ప్రసాదరావు సూచించారు. మండలంలోని శీలంవారిపల్లెలోని కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం అవార్డు గ్రహీతలను సన్మానించారు. పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న నారిశెట్టి వెంకటరామయ్య, రోటరీ తరఫున జిల్లా స్థాయి నేషన్ బిల్డర్ అవార్డు అందుకున్న మరో ఉపాధ్యాయుడు కొట్టే రవీంద్రనాథ్‌లను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్ఎం నాగినేని తిరుపతయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ నారిశెట్టి వెంకట రామయ్య అంకితభావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారన్నారు. పాఠ్య పుస్తక రచయితగా, విషయ నిపుణునిగా విద్యా రంగంలో తనదైన ముద్రవేశారన్నారు.